క్లుప్తంగా

బకాయిలు చెల్లించాలి

గుంతకల్లుటౌన్: పెండింగ్‌లో ఉన్న డీఆర్, 11వ పీఆర్‌సీ బకాయిలను చెల్లించాలని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే వైవీఆర్‌ను పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీవీఎం.చలపతి, కోశాధికారి దాదాఖాన్ వినతిపత్రాన్ని అందజేశారు. పెన్షనర్ల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు శేషశయనం, లోకిరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



తీగలను సరి చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం వద్ద రోడ్డుపై విద్యుత్ తీగలు తెగిపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం మన్రో సత్రం వద్ద రోడ్డుపై ఉన్నఫలంగా విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణాప్రాయం తప్పింది. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను నిలిపివేసి తీగలను సరి చేశారు. దీంతో కాసేపు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: జక్కలచెరువు గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం బైక్ అదుపు తప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలు.. పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గుత్తిలో భవన నిర్మాణ పనులకు వచ్చి మధ్యాహ్నం భోజనానికి వెళ్తుండగా జక్కలచెరువు సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని గుత్తి ఆసుపత్రికి తరలించి అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

యల్లనూరు: పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జెడ్పీ హైస్కూల్లో లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దారు రమాదేవి పరిశీలించారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల పోలింగ్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈసందర్భంగా ఆమె కేంద్రంలో వసతుల కల్పనపై ఆరా తీశారు. ఆర్ఐ హరిప్రసాద్, వీఆర్వో వినోద్ ఉన్నారు.

మందుల పిచికారీకి డ్రోన్ ఉపయోగకరం



డ్రోన్ స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మందుల పిచికారీకి డ్రోన్ ఉపయోగకరమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ధర్మవరం మండలం ఉప్పనేసినపల్లిలో రెడ్డిపల్లి కేవీకే ఆధ్వర్యంలో డ్రోన్ స్ప్రేయింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ డ్రోన్‌తో 10 నిమిషాల్లో ఎకరా పొలం పిచికారీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎంటీ డైరెక్టర్ కమల, రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల తుది జాబితా విడుదల

తాడిపత్రి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు సభ్యున్ని ఎన్నికకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా విడుదల చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. సుంకులమ్మపాలెంలోని చర్చిస్కూలులో రెండు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఎంపిక చేసినట్లు కమిషనర్ తెలిపారు. వార్డులో మొత్తం 2,524 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరి, టీపీఎస్ మహబూబ్‌బాషా, సీనియర్ అసిస్టెంట్ చాంద్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.

రాగిపిండి, బెల్లం సరఫరా



డీలర్లకు రాగిపిండి, బెల్లం అందిస్తున్న దృశ్యం

శింగనమల: వేసవిలో విద్యార్థులకు రాగిమాల్ట్ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం సివిల్ సప్లయీస్ స్టాక్ పాయింట్‌కు వచ్చిన రాగిపిండి, బెల్లం ప్యాకెట్లను డీలర్లకు అందజేశారు. స్టాక్ పాయింట్ నుంచి శింగనమల, నార్పల మండలాల్లోని 97 చౌకదుకాణాలను బెల్లం, రాగిపిండి సరఫరా చేశారు. డీలర్లు వాటిని ప్రభుత్వ పాఠశాలలకు చేరవేస్తారని సీఎస్‌డీటీ రాజశేఖర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిద్దాం





గుంతకల్లులో ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, తాడిపత్రిలో ఓటు అభ్యర్థిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



నార్పలలో ప్రచారం నిర్వహిస్తున్న సత్యానారాయణరెడ్డి తదితరులు

తాడిపత్రి టౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఎమ్మెల్యే తనయుడు, ఆ పార్టీ యువనేత కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఓటర్లను కోరారు. పట్టణంలోని సుంకులమ్మపాలెం, నంద్యాల రోడ్డు, సీపీఐ కాలనీ, సంజీవనగర్, పుట్లూరురోడ్డు, పాతకోట, కడప రోడ్డు, సీబీరోడ్డు, కృష్ణాపురం రోడ్లలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, కార్యాలయాలకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఆయన వెంట వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు రంగనాథరెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ చెన్నకేశవరెడ్డి, నాయకులు కేశవరెడ్డి, బాబయ్య, ప్రతాపరెడ్డి, వేణు, హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి కోరారు. శుక్రవారం డీఆర్ఎం, మున్సిపల్ కార్యాలయం, మున్సిపల్ స్కూళ్లల్లోని పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి ఓటును అభ్యర్థించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రవీంద్ర, సీనియర్ నాయకుడు నూర్‌నిజామి తదితరులు పాల్గొన్నారు.

నార్పల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నేత, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచు గవ్వల శ్రీరాములు, డైరెక్టర్ దాడితోట బాషా, ఖాదర్‌వలిఖాన్, మన్నీల శివయ్య, బాలనాగి బాలకృష్ణ, గొర్ల సుధాకర్, నాగరాజు, చికెన్ గోపాల్, మిద్దె రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్ బీ, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్‌లు వరలక్ష్మి, పద్మలత, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్‌యాదవ్, పట్టణ సచివాలయ కన్వీనర్ రంగస్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు వరదరాజులు, వాల్మీకి శివ, కేవీ రమణ, ఫరూక్, మర్తాడు హసీనా, కృపా సుజాత, అంజల, నరేష్ కోరారు. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలతో పాటు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జ్‌లు షఫి, మర్తాడు అన్సార్, జీపు రమణ, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, సునీల్, పగడాల మురళి, అబ్దుల్, రమేష్‌రెడ్డి, చెన్నాజీ, పూల మహమ్మద్, ఆటో షాషావలి పాల్గొన్నారు.

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ, తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ కార్యాలయాల్లో ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ అధికారులు, ఆయా కార్యాలయాల్లోని సిబ్బందిని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మద్దతుగా వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం రెడ్డిపల్లి, నీలారెడ్డిపల్లి, కొర్రపాడులో ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ భాస్కర్, నాయకులు ఆలూరి రమణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనపర్ బయపరెడ్డి, బీకేఎస్ సర్పంచ్ పార్వతి, పూల నారాయణస్వామి, వైస్ ఎంపీపీ రామగోపాల్, సర్పంచు శ్రీనివాసరెడ్డి, ముత్యాలశీన, నాగముని, సాకే లక్ష్మీనారాయణ, పురుషోత్తం, ముత్యాల రంగ, రామ్మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనరు ప్రభాకర్‌రెడ్డి ప్రచారంలో చేశారు. యల్లనూరు, వెన్నపూసపల్లి, నీర్జాంపల్లి, దంతలపల్లి, కొత్తపల్లిలో శుక్రవారం ప్రచారం చేశారు. నాయకులు బాలవెంకటరెడ్డి, పురుషోత్తంనాయుడు, పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఓటర్లను కోరారు. శుక్రవారం స్థానిక వెటర్నరీ, తహసీల్దార్, సబ్ ట్రెజరీ, ఎంపీడీఓ, సీడీపీఓ కార్యాలయం, కెనరా బ్యాంక్, పోలీస్‌స్టేషన్, గ్రామ సచివాలయం, జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రచారం చేశారు. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ నారాయణ, వక్ఫ్ బోర్డు జిల్లా మెంబరు నూర్‌మహమ్మద్, నాయకులు, వెంకటరమణ, శివశంకర్‌రెడ్డి, నవీన్ కుమార్, భాస్కర్ రెడ్డి, రాజు, భాస్కర్, లక్ష్మీనారాయణరెడ్డి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక టీసీహైస్కూల్, ఎస్ఎఫ్ఎస్, కృష్ణవేణి, విజ్ఞాన్ పబ్లిక్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్ల పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు పాళ్యం పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, సచివాలయాల్లో విస్తృత ప్రచారం చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం



సీడీపీఓ, ఏసీడీపీఓలు నాగలక్ష్మి, ఢిల్లీశ్వరిని సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

గుత్తి: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ నాగమణి, ఏసీడీపీఓ ఢిల్లీశ్వరి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం సీడీపీఓ, ఏసీడీపీఓలను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగేశ్వరి, కృష్ణవేణి, ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గుత్తి ఆర్ఎస్‌లోని చంద్రప్రియనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు ఆర్ఎస్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అంతార్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్ నాగేశ్వరిలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించి సాధికారత సాధించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రామాంజనమ్మ, శారద, ఏఎన్ఎం సుగుణాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ మోనాలిసా, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

గుంతకల్లు రూరల్: ఈనెల 13న పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని ఆర్డీఓ రవీంద్ర, డీఎస్పీ నర్సింగప్ప తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ రాము, ఎంపీడీఓ జాషువాతో కలిసి శుక్రవారం వారు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో 4 పోలింగ్ బూత్‌లు, ఎమ్మార్సీలో 1, ఎంపీడీవో కార్యాలయంలో 1, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం వైకేపీ కార్యాలయంలో 1 పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు పోలింగ్ స్టేషన్లలో ఏర్పాట్లను సమీక్షించారు. ఎంపీడీవో, ఎమ్మార్సీ, వైకేపీ కార్యాలయాలు పక్కపక్కనే ఉన్న నేపథ్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు ఇబ్బంది పడకుండా వేర్వేరు దారులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలింగ్ స్టేషన్లలో అన్ని ఏర్పాటు చేపట్టాలన్నారు.



పోలింగ్‌స్టేషన్‌లో ఏర్పాట్లపై చర్చిస్తున్న ఆర్డీఓ రవీంద్ర, డీఎస్పీ నర్సింగప్ప

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి

యల్లనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం నీర్జాంపల్లి, వెంకటాంపల్లి, కొత్తపల్లి, శింగవరం, గొడ్డుమర్రి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలుపై ఆరా తీశారు. బైజూస్ యాప్ నుంచి ఎంత మంది విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు.

వేరుశనగ పొట్టు దగ్ధం

పెద్దవడుగూరు : మల్లేనిపల్లిలో విద్యుత్‌తీగలు తగిలి వేరుశనగ పొట్టు దగ్ధమైంది. బాధితుడి వివరాల మేరకు... గ్రామానికి చెందిన రంగనాయకులు లక్ష్మంపల్లిలో వేరుశనగ పొట్టు కొనుగోలు చేసుకొని గ్రామానికి ట్రాక్టర్‌పై వేసుకొని వెళ్తుండగా మార్గ మధ్యమంలో హెచ్ఎల్సీ వద్ద విద్యుత్ తీగలు ట్రాక్టర్‌కు తగలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. డ్రైవర్ ట్రాక్టర్ అప్రమత్తమై కిందవేయడంతో పొట్టు కాలిపోయింది. దాదాపు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



బాధితుడికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా 13 మంది బాధితులకు రూ.11. 48 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ కిందకు రాని వైద్యానికయ్యే ఖర్చును సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరిస్తున్నారన్నారు. ఈసందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి టౌన్: స్థానిక సీబీరోడ్డులోని అబ్దుల్ కలాం ఆజాద్ మున్సిపల్ ఫంక్షన్ హాలులో శుక్రవారం ఫయాజ్ సేవా ట్రస్టు అధ్యక్షుడు ఫయాజ్ బాషా 50 మంది టీబీ రోగులకు వరుసగా ఐదో నెల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఫయాజ్ బాషా మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన టీబీ రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కొన్ని నెలలుగా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. ఉచితంగా అన్నీ రక్త పరీక్షలు చేయనున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ షాషావలి, ఉపాధ్యక్షుడు మహబూబాషా, మాజీ కౌన్సిలర్లు బాబు, వరదలయ్య, డీవీ కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు హాజీవలి, గురు ప్రసాద్‌రెడ్డి, చవ్వా రాజశేఖర్‌రెడ్డి, బషీర్, ప్రసాద్,రియాజ్, అస్లాం, షమీర్ టీబీ సూపర్‌వైజర్లు సునీల్, నాగరాజు, సిబ్బంది సౌందర్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న ఫయాజ్‌బాషా తదితరులు

సేవాగఢ్‌లో గిరిజన సంక్షేమ శాఖ డీడీ పూజలు



మాతా జగదాంబ ఆలయంలో పూజలు చేస్తున్న డీడీ రామ్మోహన్

గుత్తి రూరల్: సేవాగఢ్‌లోని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, మాతా జగదాంబ ఆలయాల్లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్ ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సేవాగఢ్‌కు వచ్చిన డీడీ రామ్మోహన్ ను సేవాలాల్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ఆలయ అర్చకుడు మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఆ సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. డీడీకి గిరిజన సంక్షేమ గురుకులంలోని సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. గురుకులంలో బోధన, బోధనేతర సిబ్బంది, పీఈటీ, ఏఎన్ఎం లను నియమించాలని ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్ కోరారు. గురుకులాల్లో రెగ్యులర్ ప్రిన్స్‌పాల్, ఉపాధ్యాయులను నియమించాలని వినతి పత్రం అందజేశారు. గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్ ఆదినారాయణరెడ్డి, బంజారా నేత సుబ్రమణ్యంనాయక్ పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సిన్

గుంతకల్లుటౌన్: రేబిస్ నియంత్రణలో భాగంగా పట్టణంలోని వివిధ కాలనీల్లో ఉన్న 152 వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయించినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలోని పశువైద్యశాలలో వెటర్నరీ సిబ్బంది కుక్కలకు వ్యాక్సినేషన్ చేసిన అనంతరం తిరిగి వాటిని అదే ప్రాంతంలో వదిలివేసినట్లు పేర్కొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: బసినేపల్లి తండా గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న వల్లేనాయక్ అనే వ్యక్తిని సెబ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందతుడి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐ అలీ అహ్మద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో పిల్లల ఆరోగ్యం

తాడిపత్రి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, అంగన్ వాడీ కేంద్రాల్లో చదువుతున్న 1–19 ఏళ్ల లోపు పిల్లలందరికీఈనెల 14న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ ప్రధానోపాధ్యాయులను కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం జరిగింది. మున్సిపల్ కమిషనర్, ఎంఈఓ నాగరాజు, పాతకోట పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సుమన్ ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగాలపై వివరించారు.

యాడికి: నులి పురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో మండలంలోని వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, సర్వశిక్ష అభియాన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఈ నెల 14 నుంచి 18 వరకు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని 1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. టిఫిన్, భోజనం తిన్న తర్వాతే మాత్రలు వేయాలని సూచించారు. ఎంఈఓ కాశెప్ప, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



హెచ్ఎంలకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న కమిషనర్ జబ్బార్‌మియా

గార్లదిన్నె: ఈనెల 14 నుంచి నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ షమీన్‌తాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నులిపురుగుల నివారణ మందుల పంపిణీపై వైద్య, అంగన్‌వాడీ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నులిపురుగులు వల్ల కలిగే నష్టాలు వివరించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఎంఈఓ చంద్రానాయక్, సీహెచ్ఓ లోక్‌నాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఏఎన్ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీఆర్పీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ జాషువా, మెడికల్ ఆఫీసర్ నవీన్‌కుమార్ బాబు, ఎంఈవో కుల్లాయప్ప మాట్లాడారు. మండలంలో ఈనెల 14న 1 నుంచి 19 ఏళ్ల లోపు చిన్నారులు 13,922 మంది ఉన్నారని, ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలతో ఉన్న పిల్లలకు ఈనెల 18న మాత్రలు వేయాలని సూచించారు.

పుట్లూరు: నులి పురుగుల నివారణ కోసం ఈ నెల 14న అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను అందించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి, డాక్టర్ హిమబిందు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కోసం ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్పల: పిల్లల ఎదుగుదలను నియంత్రించే నులిపురుగులను నివారించాలని ఎంపీడీఓ దివాకర్ పేర్కొన్నారు. ఈ నెల 14న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలకు అందించేందుకు శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్నా పాఠశాలలకు, అంగన్వాడీ సెంటర్లకు ఆల్బెండజోల్‌ను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా ఉన్న పిల్లలకు 11,950 మాత్రలను పంపిణీ చేశామన్నారు. సీడీపీఓ భారతి, ఎంఈఓ క్రిష్టయ్య, డాక్టర్ ప్రవీణ్,ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వాణి, సీహెచ్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర కిట్ల అందజేత



కిట్లు అందిస్తున్న ఓబులేసు

తాడిపత్రి టౌన్: స్థానిక కడప రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని ఐదుగురు పేద బుద్ధి మాంద్యం పిల్లల కుటుంబాలకు హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్ ఓబులేసు నిత్యవసర కిట్లు అందజేశారు. విధివంచితులు శీర్షికన సాక్షి దిన పత్రికలో జనవరి 29న కథనం ప్రచురితమైంది. ఓబులేసు స్పందించి బాధిత ఐదు కుటుంబాలకు వరుసగా ఆరు నెలలు నిత్యవసర వస్తువులు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. రెండో నెలకు సంబంధించి శుక్రవారం నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

14న వేలం పాట

పెద్దపప్పూరు: అశ్వత్థంలో ఈ నెల 14న భక్తులు స్వామికి సమర్పించిన బియ్యం, బేడల విక్రమాన్ని వేలం వేస్తున్నట్లు ఆలయ ఈఓ సుబ్రమణ్యం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అశ్వర్థ నారాయణ స్వామి, భీమలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం 11 గంటలకు వేలం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని మార్కెట్ యార్డు, ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఈమేరకు డీఈ రంగస్వామి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ప్రత్యేక హోదా కోసం సైకిల్‌యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న ప్రసాద్

పెద్దవడుగూరు : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కోరుతూ ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకూ శ్రీకాకుళం జిల్లా వాసి నైలు ప్రసాద్ అనే దివ్యాంగుడు చేపట్టిన మూడు చక్రాల సైకిల్ పై యాత్ర శుక్రవారం పెద్దవడుగూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 13 జిల్లాలు, 210 మండలాలు తిరిగి అధికారులకు వినతి పత్రాలను అందజేస్తున్నానన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు.

వైద్య సిబ్బందికి సన్మానం

యల్లనూరు: స్థానిక పీహెచ్‌సీ సూపర్‌వైజర్ తిరుపాలయ్యను ఉన్నతాధికారులు డీహెచ్‌ఈహెచ్ మండలం నాగలాపురం, స్టాఫ్‌నర్సు రమాదేవిని పత్తికొండకు బదిలీ చేశారు. దీంతో శుక్రవారం వారిని స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైద్యాధికారి లోకేష్, శివసాయి, ఎంపీహెచ్ఈవో మధుకుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలుకు క్షతగాత్రుడి తరలింపు

రాప్తాడురూరల్: కురుగుంట సమీపంలోని ఇంటెల్ కళాశాల వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కుల్లాయిస్వామిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కురుగుంటలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో పీడీగా పని చేస్తున్న శైలజ (50) ఘటనా స్థలంలో అక్కడికక్కడే మృతిచెందిన విషయం విదితమే. నార్పల మండలం గూగూడు కుల్లాయిస్వామి దర్శనానికి వెళ్లిన శైలజ..తిరుగు ప్రయాణంలో పాత విద్యార్థి కుల్లాయిస్వామితో కలిసి బైకుపై బయల్దేరారు. ఇంటెల్ కళాశాల వద్ద డివైడర్లు మూసిన తర్వాత రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఆపి ఉన్న బండలలారీని గుర్తించక వెనుకవైపు నుంచి బలంగా ఢీ కొట్టి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లిన కుల్లాయిస్వామి శుక్రవారం రాత్రిదాకా స్పృహలోకి రాలేదని బంధువులు తెలిపారు.